క్లుప్తంగా

విద్యా పథకాలను సద్వినియోగం చేసుకోండి

పెద్దాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారులు శర్మ, చౌదరి అన్నారు. మండలంలోని జి.రాగంపేట గ్రామంలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర స్టూడెంట్ కిట్లను వారు పంపిణీ చేశారు. సర్పంచ్ బుంగా శేఖర్ అధ్యక్షతన జరిగిన పంపిణీ సభలో ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై పరిశీలన



పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ కిశోర్

కొత్తపల్లి: కొండెవరం గ్రామ సచివాలయంలో వచ్చే నెల ఒకటో తేదీన పింఛన్లు పంపిణీపై ఆర్డీఓ ఇట్ల కిషోర్, పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. పింఛన్లు పంపిణీకి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

పింఛనుదారులూ.. ఇళ్లలోనే ఉండండి

సామర్లకోట: పింఛను లబ్ధిదారులు అందరూ ఒకటో తేదీన ఇళ్ల వద్దనే అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని 18 గ్రామాల్లో 11,880 మంది పింఛనుదారులు ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకటో తేదీనే 100 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించిందన్నారు. ఈ మేరకు ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుంచి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పింఛను పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళకు తీవ్ర గాయాలు



సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న మంగ

సామర్లకోట: నూతనంగా నిర్మించిన ఇంట్లో శుభ్రం చేస్తున్న సమయంలో విద్యుత్తు షాక్‌కు గురై ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం గణేష్ కాలనీకి చెందిన మల్లవరపు మంగ మంగళవారం నీటితో ఇంటిని శుభ్రం చేస్తున్నారు. ఆ సమయంలో మేడ పై భాగంలో ఉన్న 11 కేవీ విద్యుత్తు వైర్లు ప్రమాదవశాత్తు తగలడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే ఆమెను స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల తరుచూ ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రమాదకరమైన విద్యుత్తు వైర్లు ఉన్నాయని ఎందుకు హెచ్చరికలు జారీ చేయడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థులకు ప్రభుత్వ వసతి గృహం ఏర్పాటు చేయాలి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కణితి సతీష్

పెద్దాపురం: డివిజన్‌లోని గండేపల్లి మండలం రామేశ్వరంపేటలో ప్రభుత్వ వసతిగృహం ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రామేశ్వరంపేటలో ఆదిత్య, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయని, వేల మంది విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారన్నారు. దూర ప్రాంతాల వారికి ప్రైవేట్ హాస్టల్ ఉండడం వల్ల వేలవేలకు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. పేద విద్యార్థులకు భారంగా మారుతున్న వసతిగృహ అవసరాన్ని గుర్తించి సత్వరమే ప్రభుత్వ వసతిగృహ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో. ధనరాజ్, గౌతమ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి పూజలు

కొత్తపల్లి: కొమరగిరిలో ఉన్న విశ్వేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం కృత్తికా నక్షత్రం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామి వారికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

సాగు సాయం ఏదీ?

- అన్నదాతకు ఏడాదికి రూ.20 వేలు హామీ ఇచ్చి ఊసెత్తని సీఎం చంద్రబాబు
- రైతు భరోసా పేరు మార్చారే తప్పా సాయంపై స్పష్ట తవ్వని కూటమి
- ఖరీఫ్ ప్రారంభమై నెలవుతున్నా అందని అన్నదాత సుఖీభవ
- ఎదురు చూస్తున్న రైతులు



సాగు చేస్తున్న రైతులు

కొత్తపల్లి: రైతన్నకు టీడీపీ పాలనలో సాగు ఇబ్బందులు తప్పడం లేదు. ఖరీఫ్ సాగుకు పెట్టుబడి సాయం అందుతుందని ఆశ పడిన రైతులకు నిరాశే మిగిలింది. రూ. 20వేలు అందజేస్తామని హామీ గుప్పించిన సీఎం చంద్రబాబు రైతులకు మొండి చెయ్యి చూపారు. గత జగనన్న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రైతుభరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవ అంటూ మార్చారే తప్ప సాయం మాత్రం అందించలేదు. జులై నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నుంచే వర్షాలు అనుకులంగానే కురిశాయి. అయితే వారం క్రితం కురుసిన వర్షాలు నారుమడులకు ఉపయోగపడ్డాయి. అయితే పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు నిరాశకు గురువుతున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకానికి సంబంధించి తొలి విడత సాయంగా రూ.2వేలు రైతుల ఖాతాల్లో జమ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న పెటుబడి సాయంపై ఊసేలేదు. మే లోనే రైతు భరోసా నగదు రూ.5500 ఇవ్వాల్సి ఉండగా ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో అది కాస్త ఆగిపోయింది. ప్రస్తుతం కేంద్రం అందజేసిన పీఎం కిసాన్ నగదుతో కూలీల ఖర్చులకు ఉపయోగ పడింది. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కోసం రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో రైతులు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

గత ప్రభుత్వం ప్రారంభంలోనే పెట్టుబడి సాయం

గతంలో పంటల సాగు పెట్టుబడి కోసం రైతన్నలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైస్సార్‌సీపీ ప్రభుత్వం సాగు ఆరంభంలోనే పెట్టుబడి సాయాన్ని అందించేది. పీఎం కిసాన్ సాయం రూ.6 వేలు, రైతు భరోసా రూ.7500 కలిపి ఏటా రూ.13500 చొప్పున మూడు విడతలుగా రైతులకు అందేది. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో మళ్లీ కష్టాలు మొదలయ్యాయని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సాయం కోసం రైతుల ఎదురుచూపు

పిఠాపురం నియోజకవర్గంలో కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో 12087 హెక్టారుల్లో సాగు చేస్తున్నారు. కొత్తపల్లి మండలంలో 10,154 ఎకరాల్లో సుమారు 6150 మంది రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఆయా మండలాల్లో కొందరూ రైతులు ఇప్పటికే పత్తి, మొక్కజొన్న, ఉల్లి, కురగాయలు తదితర పంటలు సాగు చేస్తున్నారు. గతంలో పీఎం కిసాన్ తోపాటు రైతు భరోసా ఒకేసారి అందుతుడడంతో పెట్టుబడికి ఉపయోగడేది. ఇప్పడు పీఎం కిసాన్ రూ. 2వేలు మాత్రమే అందడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు అందిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. కూటమి ప్రభుత్వం వచ్చి సుమారు రెండు నెలలు గడుస్తున్నా రైతుల పెట్టుబడి సాయంపై కనీసం ప్రకటన చేయలేదు. దీంతో సాగు ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

సమయం దాటితే ఉపయోగం లేదు..



గత ప్రభుత్వంలో ఖరీఫ్ పంట కాలం ప్రారంభంలోనే పెట్టుబడి సాయం అందేదీ. ఇది పంట పెట్టుబడి కోసం ఎంతో ఉపయోగపడేది. ప్రస్తుతం ఖరీఫ్ సాగు సీజన్ జరుగుతున్నా ఇంత వరకూ ప్రభుత్వం పెట్టుబడి సాయం ప్రకటించ లేదు. సమయాని ఇస్తే బాగుంటుంది. వెంటనే పెట్టుబడి సాయం అందించాలి.

– కాజులూరి నేరెళ్ళ రెడ్డి, రైతు రమణక్కపేట

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు ఇస్తానన్న పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇచ్చి మాట నిలబెట్టుకోవాలి. పంట పనులు ప్రాంభంలోనే పెట్టుబడి సాయం అందిస్తే రైతుకు అప్పు చేయాల్సిన పని ఉండదు. ఇప్పటివరకూ రైతులు పెట్టుబడి సహాయం కోసం ప్రభుత్వం ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

– పెనుమల్లు పాపిరెడ్డి, రైతు రమణక్కపేట

రహదారిలో మట్టి తొలగింపు



రోడ్డు మార్జిన్‌లో మట్టి తొలగింపు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేట జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయిన మట్టిని మంగళవారం మున్సిపల్ మినీ జేసీబీతో తొలగించారు. సాక్షి దినపత్రికలో 'రోడ్డు మార్జిన్‌లో పెరిగి పోయిన మట్టి' అనే శీర్షికతో ప్రచురితమైన కథానానికి మున్సిపల్ కమిషనర్ జె.రామారావు స్పందించారు. ఈ మేరకు రోడ్డు మార్జిన్‌లో పెరిగిపోయిన మట్టి తొలగింపు పనులను కమిషనర్ పరిశీలించారు. ఆ ప్రాంతంలో మున్సిపల్ కుళాయిల నుంచి వస్తున్న తాగునీటిని పరిశీలించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: ప్రతి నెలా జరిగే విధంగా బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు నిర్వహించడానికి తయారు చేసిన అజెండాలలో 17 అంశాలను పొందుపరిచామని, వాటిపై చర్చించడానికి సమావేశం ఏర్పాటు చేసినట్టు కమిషనర్ తెలిపారు. ఈ సమావేశానికి అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి

ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యల్లా శివ ప్రసాద్



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యల్లా శివప్రసాద్

పిఠాపురం: విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని విశ్రాంత ఇస్రో శాస్త్రవేత్త యల్లా శివ ప్రసాద్ సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో ఆదర్శ్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం బీటెక్ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో అడుగుపెడుతున్న విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ విద్య యొక్క ఆవశ్యకతను, ఉపాధి అవకాశాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించడానికి కావాల్సిన నైపుణ్యాలను ఎలా అభివృద్ధి చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బుర్రా అనుబాబు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బుర్రా అనురాధ, డైరెక్టర్ అఖిలేష్, బీటెక్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డిప్లొమా ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో అధికారుల పూజలు



రాష్ట్ర స్థాయి అధికారులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న ఆలయ వేద పండితులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారా రామ భీమేశ్వరాలయంలో రాష్ట్ర స్థాయి అధికారులు మంగళవారం స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వారికి ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం లభించింది. ఆదాయ పన్నుశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత, చీఫ్ కమిషనర్ వరీంద్ర మోహతా, ప్రిన్సిపల్ కమిషనర్ సునిత బిల్లా, అడ్మిన్ ప్రిన్సిల్ కమిషనర్ రవికిరణ్, టీడీఎస్ ప్రిన్సిపల్ కమిషనర్ నరేష్ సాకాలు ఆలయంలో స్వామి వారిని అమ్మవార్లకు దర్శించుకున్నారు. వారికి ఆలయ పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఈఓ వారికి ప్రసాదం, స్వామి వారి ఫొటోలను అందజేశారు.

రెండున ఆషాఢ మాస వేడుక

స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల రెండో తేదీన ఆషాఢ మాస వేడుక నిర్వహిస్తున్నట్టు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మాస శివరాత్రిని పురస్కరించుకుని అమ్మవారిని శాకంబరిగా అలంకరించనున్నారు. దీనిలో భాగంగా ఉదయం 8 గంటలకు స్థానిక మాండవ్యనారాయణస్వామి ఆలయం నుంచి పంచా రామ క్షేత్రం వరకు అమ్మవారికి చీర–సారె ఊరేగింపు ఉంటుందన్నారు.


విద్యార్థులకు కిట్ల పంపిణీ



హుస్సేన్‌పురంలో విద్యార్థులకు అందజేస్తున్న కిట్లు

సామర్లకోట: మండల స్థాయిలో విద్యార్థులకు కిట్స్ పంపిణీని ఎమ్మెల్యే చినరాజప్ప ప్రారంభించడంతో ఆయా గ్రామాలు, పట్టణ పరిధిలోని పాఠశాలల్లో కిట్ల పంపిణీ చురుగ్గా సాగుతోంది. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో, వివిధ గ్రామాల్లో మంగళవారం బ్యాగ్‌లు, యూనిఫాం పంపిణీ చేశారు.

సమాజ దార్శనికుడు రాంషా



'గోదావరి పొంగింది' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

- ఆయన రచనలు వాస్తవాలకు ప్రతిబింబాలన్న సాహితీవేత్తలు
- ఘనంగా శత జయంతి వేడుకలు

బోట్‌క్లబ్: సుప్రసిద్ధ సాహితీవేత్త, అభిసారిక దాంపత్య విజ్ఞాన మాసపత్రిక వ్యవస్థాపకులు దివంగత దర్బా రాంషా జీవిత చరిత్ర పరిశీలిస్తే సమాజ దార్శనికుడిగా వినుతికెక్కారని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం స్థానిక రోటరీ హాల్‌లో రాంషా శతజయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొరుప్రోలు గౌరినాయుడు అధ్యక్షత వహించారు. పలువురు వక్తలు ప్రసంగిస్తూ రాంషా సాహిత్యం ద్వారా సమాజాన్ని ఎంతో ప్రభావితం చేసారన్నారు. పలు సంకలనాలపై విమర్శ చేస్తూ ముద్రించిన రచనలు ఎంతో విమర్శనాత్మకంగా, ఆలోచింపజేసే విధంగా ఉన్నాయని కొనియాడారు. నాటకాలు, నాటికలు, కావ్యసంపుటి, కథా సంకలనాలు, తాత్విక, ధార్మిక గ్రంథాలు, సైన్స్ పుస్తకాలు వంటి అనేక అంశాలపై ఆయన చేసిన రచనలు వాస్తవాలను ప్రతిబింబించేలా ఉండడమే కాక అనేక మందికి మార్గదర్శకంగా ఉన్నాయన్నారు. కుటుంబ పరంగా ఎన్నో అంశాలను తన సంతానానికి బోధించడమే కాక సమాజంలో ఎలా నడుచుకోవాలన్న అంశంపై కూడా చేసిన రచనలు అందరినీ ఆలోచింపజేసే విధంగా ఉన్నాయన్నారు. రాంషా రచనలకు, సాహిత్యానికి సముచిత స్థానం దక్కలేదని వారు అభిప్రాయపడ్డారు. శతజయంతి ఉత్సవాలు నిర్వహించడం ద్వారా ఆయన వ్యక్తిత్వంతో పాటు ఆలోచనా సరళి కూడా నేటి ప్రపంచానికి ఎంతో అవసరమని పలువురు అన్నారు. 'ఆధ్యాత్మిక కోణంలో రాంషా' అనే అంశంపై కాశీభొట్ల సత్యనారామణ, ధర్మరతి ప్రతిపాదకుడు రాంషా అని అంశంపై జీవీ పూర్ణ చందు, కవి రచయితగా రాంషా అనే అంశంపై కార్తికేయ శర్మ, తెలుగు సాహిత్యలోకంపై రాంషా ప్రభావం అనే అంశంపై జయంతి నాగేశ్వరరావు, స్మృతి అనే అంశంపై ఆచార్య టి.విశ్వనాథరావు ప్రసంగించారు. రాంషా శతజయంతి పురస్కారాలను సాహిత్యరంగంలో విశేషకృషి చేసిన మాకినీడి సూర్య భాస్కర్, సెక్సాలజీ రంగంలో ప్రొఫెసర్ డాక్టర్ గోదా వెంకటరమణలకు అందజేశారు. ఈ సందర్భంగా రాంషా రచించిన 'గోదావరి పొంగింది' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

స్వామివారి సన్నిధిలో పనిచేయడం అదృష్టం

తహసీల్దార్‌కు ఘనంగా వీడ్కోలు



తహసీల్దార్ శ్రీనివాస్ దంపతులను సత్కరించిన రెవెన్యూ అధికారులు

సామర్లకోట: పంచారామ క్షేత్రం స్వామి వారు ఉన్న మండలంలో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానని తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బదిలీపై వచ్చిన ఆయన తిరిగి పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు తహసీల్దార్‌గా పని చేసిన శ్రీనివాస్‌కు రెవెన్యూ అధికారులు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా అన్ని శాఖల అధికారులు సహకరించారన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దంపతులను రెవెన్యూ అధికారులు సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ యలమంచలి శ్రీనివాస్, సర్వే డీటీ ఆర్.శ్రీనివాసరావు, వీఆర్వోల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కామరాజు, కేవీవీ సత్యనారాయణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై శ్రద్ధ చూపాలి



విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివిస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: విద్యార్థుల పుస్తక పఠనంపై ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. మండల పరిధిలో కొప్పవరం, జొన్నలదొడ్డి గ్రామాల్లోని ఎలిమెంటరీ పాఠశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసు కున్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెరగాలన్నారు. పుస్తక పఠనంతో పాటు చేతి రాత బాగుంటే విద్యార్థులకు మంచి మార్కులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరక కాపీ రైటింగ్‌పై విద్యార్థులకు అవగాహన పెంచాలని సూచించారు. గడిచిన సిలబస్‌పై నిత్యం సమీక్షించాలని సూచించారు.

కదంబ పుష్పాలంకరణలో అపర్ణాదేవి



పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసి ఉన్న అపర్ణాదేవి అమ్మవారు మంగళవారం కదంబ పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏటా ఆషాడ మాసంలో మంగళవారం రోజున అమ్మవారిని కదంబ పుష్పాలతో అలంకరించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ అర్చకులు తెలిపారు. ఈసందర్భంగా పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తమ్ముడిపై కత్తితో దాడి

కొత్తపల్లి: తనకన్న పెద్దవాడికి, చిన్నవారికి పెళ్లి చేసి తనకెందుకు చేయడంలేదని తీవ్ర మనస్తాపానికి గురై తమ్ముడిపై కత్తితో దాడి చేసిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంపురానికి చెందిన పిర్ల రామకృష్ణకు ఇద్దరు సోదరులు ఉన్నారు. తన అన్నకు, తమ్ముడికి వివాహాలు జరిగాయి. గత మూడు రోజుల నుంచి తన అన్న కుమారుడికి అనారోగ్యం కావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో ఉన్నారు. ఆ మూడు రోజుల నుంచి తనను ఎవరూ పట్టించుకోవడం లేదని, కనీసం పెళ్లి కూడా చేయడం లేదని మనస్తాపం చెంది తమ్ముడు సత్తిబాబుపై కత్తితో దాడి చేశాడు. గాయపడిన సత్తిబాబును కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్సై స్వామి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

పిఠాపురం: భారతీయ జనతా పార్టీ పిఠాపురం పట్టణ శాఖ నూతన కార్యాలయం పిఠాపురం పోలీస్ స్టేషన్ సెంటర్‌లో మంగళవారం ప్రారంభించారు. స్థానిక పట్టణ శాఖ అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో కో–కన్వీనర్ వాసంశెట్టి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు దాట్ల వెంకటసూర్యనారాయణ రాజు, గండి కొండలరావు, స్వచ్ఛభారత్ స్టేట్ కో– కన్వీనర్ బుర్రి మురళీధర్ రావు, సీనియర్ నాయకులు ఏడుకొండలు తదితరులు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు లింగంపల్లి రవీంద్రబాబు, జిల్లా స్వచ్ఛభారత్ కో–కన్వీనర్ ఓలేటి వెంకటేశ్వర్, బండే శ్రీనివాస్, వరద బ్రహ్మాజీ, గొల్లప్రోలు టౌన్ అధ్యక్షుడు చిట్ట మధు, గొల్లప్రోలు రూరల్ అధ్యక్షుడు పోసిని సత్యనారాయణ, కర్రి సత్యనారాయణ, మేడిది రవితేజ, కొమ్మిరెడ్డి వీరభద్ర రావు, వెన్న సుబ్బారావు, సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.



నాడు చక్కని నిర్వహణతో ఉన్న నక్షత్ర వనం



నేడు తుప్పలు, గడ్డి పెరిగిపోయి అధ్వానంగా ఉన్న వనం

వనం.. కళావిహీనం

- నాడు అవగాహన కల్పించేలా నవనవలాడిన నక్షత్ర వనం
- నేడు తుప్పలతో అధ్వానం
- నిర్వహణ లేక అడవిని తలపిస్తున్న వైనం

బాలాజీచెరువు: నగరం మధ్యలో దాదాపు 70 ఏకరాలకు పైబడి ఉన్న జేఎన్‌టీయూకేలో పర్యావరణ ప్రాజెక్టుగా ఏర్పాటు చేసిన నక్షత్ర వనం నేడు నిర్వీర్యంగా మారింది. 2010లో నక్షత్ర వనం పేరుతో దాదాపు ఎకరానికి పైగా స్థలంలో మొక్కలు నాటడానికి ప్రణాళిక రూపొదించి దానికి శంకుస్థాపన చేసినా నేటికీ పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చలేదు. దాదాపు 12 ఏళ్ల పాటు ఆ ప్రాంతం నిరుపయోగంగా మారింది. గత ఏడాది మాజీ వీసీ డాక్టర్ ప్రసాదరాజు చొరవ తీసుకుని పనుల్లో కదలిక తీసుకువచ్చారు. పర్యావరణ ప్రేమికుడైన ప్రస్తుత ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ ఆ కాలంలో గ్రీన్ ఇనిషియేటివ్ డైరెక్టర్‌గా కీలక పాత్ర పోషించారు. అలాగే మియావాకీ ప్లాంటేషన్ పేరుతో 2020 మొక్కలు నాటి మినీ అడవిగా ఏర్పాటు చేయగా, ప్రిన్సిపాల్ కార్యాలయం పక్కన ఆయన రూపొందించిన ప్రాజెక్టులను జంగిల్ బుక్ పేరుతో మొక్కల మధ్యలో పాఠ్యాంశాలు బోధించేలా ఏర్పాటు చేశారు. కళాశాల పూర్వ విద్యార్థి రేఖపల్లి శ్రీనివాసరావు ఆర్థిక చేయూతతో నక్షత్రవనంలో కొంత భాగాన్ని వినియోగంలోకి తీసుకువచ్చారు. గ్రీన్ క్యాంపస్ ఆడిట్‌లో ఇవి తోడ్పడ్డాయి.

నక్షత్ర వనం అంటే..



పూర్వాభాద్ర నక్షత్రానికి సంబంధించి నాటిన మొక్క

మనిషి పుట్టిన సమయం బట్టి జన్మ నక్షత్రం ఉంటుంది. కాలగమనం ప్రకారం జన్మనక్షత్రాలు అశ్విని మొదలు రేవతి వరకు ఒక్కో దానికి ఒకొక్క రకమైన మొక్క ఉంటుంది. అలాగే 27 నక్షత్రాలతో 108 మొక్కలను ప్రత్యేకమైన ప్రాంతంలో ఏర్పాటుచేసి ప్రతి మొక్క వద్ద ఆ మొక్కకు సంబంధించి నక్షత్రం పేరు రాసి అక్కడ క్యూఆర్ బోర్డు ఏర్పాటు చేశారు.ఆ క్యూఆర్‌ను స్కాన్ చేస్తే మొక్క రకం, ఆ జన్మనక్షత్ర రాశివారి గుణగుణాలు, వారి స్వభావం తదితర సమాచారం నిక్షిప్తమై ఉంటుంది.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం



వర్సిటీతో పాటు కళాశాల అవరణలో పర్యావరణ ప్రాజెక్టుల సంరక్షణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. గ్రీన్ క్యాంపస్ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పర్యావరణానికి సంబంధించి పలు ప్రాజెక్టులు చేపట్టి విద్యార్థులను భాగస్వామ్యం చేసి పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్నాం. 75 ఏళ్ల వయసు పైబడి ఉన్న చెట్ల నిర్వహణకు, నిత్య నూతనంగా, పచ్చగా ఉండేలా చూసేందుకు, దాని నిర్వహణ బాధ్యతలు తీసుకున్న వారికి ఏడాదికి రూ.2500 పెన్షన్ ఇచ్చే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాం.

– డాక్టర్ మురళీకృష్ణ, ఇన్‌చార్జి వీసీ, జేఎన్‌టీయూకే